


# స్పెషల్ రూం

జెనరల్ వార్డ్ పేదరికాన్ని చూచి 'ఛీఛీ' అంటే స్పెషల్‌రూం గొప్పతనానికి కలిగిన ఎటాక్.

పార్వతికి పసిపిల్లలంటే అసహ్యం. పురిటి మంచందగ్గరకు వస్తే ఆ వాసన భరించలేదు. మంచంమీద బట్టలన్నీ తడిసి నానా బీభత్సంగా ఉంటాయి. ఆ తల్లి బట్టలన్నీ చుట్టచుట్టి బొక్కెనలో పడేస్తుంటే వాంతి వచ్చినంత పనయ్యేది.

పెళ్ళయింతర్వాత ఆమె ఆలోచనల్లో కొంత మార్పు వచ్చింది. అసహ్యం అనుకున్నవన్నీ నిజంగా అసహ్యం కాదు. కొన్ని ఆనందంగా కూడా ఉంటాయి. పార్వతికి నవ్వు వచ్చింది. ఎక్కడో పసిపిల్ల క్యారుమన్న ధ్వని వినిపించేప్పటికి గబుక్కున కడుపు చూసుకుంది. తన బిడ్డ కాదు ఏడ్చింది. ఎక్కడో పక్కగదిలో అయి ఉంటుంది. అయినా గర్భంలో ఉన్న పిల్లలు ఏడుస్తారా? ఏడ్చినా మనకు వినిపిస్తుందా! పార్వతి ఈసారి బిగ్గరగానే నవ్వింది.

డాక్టరు లక్ష్మీసావిత్రి గదిలోపలికి వస్తూ, "ఏమిటి ఆ జోకు, మాకు గూడా చెప్పండి" అంది. పార్వతి చాలా సిగ్గుపడింది. "అబ్బే... ఏం లేదు..." అంది. "బహుశా మీ శ్రీవారికి ఒక్కరికే చెప్పే జోకు అయి ఉంటుంది" అంది డాక్టరు మంచం దగ్గరకు కుర్చీ లాక్కుంటూ.

"బాబును చూడాలని ఉంది" అంది పార్వతి. "బాబు అని మీరు ఎలా గుర్తుపట్టారు? తెలుస్తోందా?"

డాక్టరు సావిత్రి నవ్వుతూంటే పార్వతికి అంతులేని ధైర్యం, తన క్షేమం గురించి తనకంటే

డాక్టరుకే ఎక్కువ శ్రద్ధ. ఆసుపత్రిలో చేరిననాటినుంచీ ఎన్నిరకాల పరీక్షలు చేయించిందో! అన్నీ సరీగ్గానే ఉన్నాయి. సిగ్నలు ఇచ్చారు. జెండా చూపారు, రైలు రావటం లేదు. అట్లా ఉంది పరిస్థితి. ఎక్కడ రైలు కూత వినిపించినా మన రైలు వచ్చినట్లు కంగారుపడ్డట్లే పసిపిల్ల క్యారుమనటం వినిపించినప్పుడల్లా పార్వతి తన బిడ్డేనన్నట్లు కంగారుపడుతోంది.

పార్వతి అత్తగారు తొందర తొందరగా గదిలోకి వచ్చి ఒక దానిమ్మపండు, జామపండు ఇచ్చింది. "తినవే... తిను... మళ్ళా పురుడు వచ్చిందంటే నెలరోజుల దాకా పథ్యం ఉండాలి. ఇప్పుడే నీకిష్టమయినవన్నీ తినాలి..." అత్తగారు దానిమ్మకాయ పగలదీసి గింజలన్నీ విరిచి చేతిలో పోస్తోంది.

డాక్టరు సావిత్రి రెండు గింజలు పార్వతి చేతిలోంచి అందుకుని నోట్లో వేసుకుంటూ "కోడలికి కాయా, పండూ ఇచ్చే అత్తలు కూడా ఉన్నారండీ కలికాలంలో..." అంది నవ్వుతూ.

"అచ్చంగా అత్తనయితే నేనూ పీక్కుని తినేదాన్నే... స్వయానా మేనకోడలు కోడలయింది కాబట్టి ఈ అవస్థలన్నీ... అయినా తెలీక అడుగుతాను... దానిచేతిలో గింజలన్నీ మీరు ఏరుకొని తింటున్నారు... ఇంతకీ పురుడు పోసుకునేది ఎవరూ!" అంది అత్తగారు డాక్టరు సావిత్రి వంక నవ్వుతూ చూస్తూ.

"అడిగారు కాబట్టి చెపుతున్నాను... ఈ పురుడు నేనే పోసుకోవలసివచ్చేట్టుంది..." అంది సావిత్రి.

"ఎందుకు... మా కోడలు కననంటోందా?"

"ఆ మాట నోటితో చెప్పలేదు గాని విషయం అదే...!"

"అంటే...!"

"అంటే ఏంలేదు... పురుడు సహజంగా వచ్చేట్టు లేదు..."

పార్వతి ముఖకవళికలు క్షణంలో మారినాయి. ఒక్కసారి ఎండపోయి ఆకాశం మబ్బులు కమ్మినట్లుంది. అత్తగారు గింజలు గబగబా విరిచి చేతిలో పోసి డాక్టరు చేయి పట్టుకుని లేవబోయింది బయట వరండాలోకి పోయి మాట్లాడదామని సంజ్ఞ చేస్తూ. పార్వతి వారించింది.

"మీరు చెప్పుకునేదేదో ఇక్కడే చెప్పండి... నాకు రహస్యాలు దాచినట్టు తెలిస్తే అసలు తట్టుకోలేను... ఏమే సావిత్రీ... నిజం చెప్పు..." అంది పార్వతి, డాక్టరు సావిత్రికి డాక్టరు హోదా తీసేసి తన క్లాసుమేటు సావిత్రిగానే చనువుగా పలకరిస్తూ.

"నీకేదో అబద్ధాలు చెప్పి మోసం చేద్దామని కాదే... ప్రతిదానికి మరుగు అనేది ఉండాలి... ఆఖరికి వంటింటికి కూడా మరుగు అవసరం అంటారు..." అంది సావిత్రి.

"దీని మొహం... ఇదెప్పుడన్నా వంటచేసి వారిస్తేనా... తెలియటానికి... ముందర నాతో చెప్పు దీనికి కూడా చెపుదాంలే..." అంది అత్తగారు సావిత్రిని బయటకు పిలుస్తూ. పార్వతి మంచంమీదనుంచి లేచి ఇద్దరినీపట్టుకుని "నామీద ఒట్టు... ఇక్కడే చెప్పండి..." అంది. సావిత్రి ఇరకాటంలో పడింది.

"సరేనోయి... పురుడు కష్టం అయ్యేట్లుగా ఉంది... నీ సహకారం కూడా అవసరం... భయపడేది ఏంలేదనుకో..."

"మరిచెప్పు... దాపరికం దేనికి? ఆపరేషను... అవసరం అనే నిర్ణయానికి వచ్చాం. సిజేరియన్ కేసు..." సావిత్రి నింపాదిగా చెప్పింది. అత్తగారు పార్వతి చేయి పట్టుకుని మంచంమీద కూర్చోపెట్టింది.

"మేమంతా లేముటే... దీంట్లో అధైర్యపడాల్సినదేం లేదు..."

"ఊ..." అంది పార్వతి. "బాబుకి... ఏమన్నా..." సావిత్రి తల ఆడించింది. "ఈ రోజుల్లో మూడువంతులు ఆపరేషన్లు ఈ కేసులేనే... నీకు కొత్తగాని..." అంది ధైర్యం చెబుతూ.

"సరేననుకో... బాబుకి ఆ కత్తులు... కరార్లు తగలవు గదా .." పార్వతి తలవంచుకుని మెల్లిగా అడిగింది. అత్తగారు ఏం మాట్లాడలేక రెండుసార్లు నోరు తెరిచి ఆగిపోయింది.

"ఆపరేషనంటే... తెలుగు సినిమాలో కత్తియుద్ధం అనుకున్నావేంటే... నీకుగాని, నీ బిడ్డకుగాని ఆపరేషను జరిగినట్లే తెలియదు... సరేనా..."

"నిజం!"

"ముమ్మాటికీ నిజం... నీకు బిడ్డను కన్న తృప్తి ఉండదు కాని వేరే ఇబ్బందేమీ లేదు... ఆల్‌రైట్..." సావిత్రి పార్వతి బుజాన చెయ్యివేసి చెబుతూంటే ఆమె బుగ్గలు కందాయి. కంటిరెప్పలు టపటపలాడిస్తూ సావిత్రి కాళ్ళవంకనే చూస్తూ "ఏమిటే... మరీ గడుగ్గాయి మాటలు...ఛీ..." అంది.

"విషయం అది... ఛీ... అనుకున్నా సరే... ఛా... అనుకున్నా సరే .. ఓ.కే... వస్తాను" అంటూ సావిత్రి వెళ్ళిపోయింది.

పార్వతి ఆపరేషను ధియేటరు ఊహించుకుంటూ ఆలోచనలో పడింది. గోపాలం కారుదిగివచ్చి ఫ్లాస్కు, చీరెల సంచీ తెచ్చి నిలబడ్డాడు. మంచం పక్కన టేబులుమీద తెచ్చిన సామాన్లన్నీ పెట్టి మెదలకుండా నిలబడ్డాడు.

"ఆపరేషను అంటున్నారు..." అంది రావమ్మ కొడుకుతో.

"ఎవరికీ?" అన్నాడు గోపాలం. పరధ్యాన్నంగా చూస్తున్న గోపాలం వంక రావమ్మ ఎగాదిగా చూసి "ఇంటిదగ్గరనుంచేనా రావటం..." అని అడిగింది కోపంగా. "ఎవరు?" అన్నాడు గోపాలం.

రావమ్మకు వళ్లు మండింది. "చూడు నాయనా... డాక్టరుగారు ఆపరేషను అంటున్నారు... నువ్వు చేస్తావేమో కనుక్కోమన్నారు" అంది రావమ్మ. "అమ్మాయి... నేను పోయి పంపు దగ్గర నీళ్ళు పట్టుకుని వస్తాను... మరచెంబు ఎక్కడే" అని నాలుగు మూలలా చూసి టేబులు వెనకాల ఉన్న మరచెంబు పట్టుకుని బయటకు పోయింది విసవిసా.

"ఆపరేషన్... నన్ను చెయ్యమంటుందేమిటి? ఎవరుచేసే పనులు వాళ్ళు చెయ్యాలిగాని... నీ డాక్టరు ఫ్రెండుందిగదా..." అన్నాడు గోపాలం మెల్లిగా మంచంమీద కూర్చుంటూ.

"మీకన్నీ ఎగతాళిగా ఉంటాయి... పెద్ద ఆపరేషను... అంటున్నారు" పార్వతి జంకుగా చూసింది.

"నాకు అన్నీ తెలుసులేవోయ్. డాక్టరుగారి దగ్గరకు వెళ్ళి కాగితాలు సంతకాలు పెట్టి వస్తున్నాను." గోపాలం జేబులో పెన్ను తీసి చూపించాడు. చేతి కంటిన సిరా చూపించాడు.

"ఆపరేషనంటే మనకేం గొడవ... హాయిగా పడుకుని నిద్రోతాం... నిద్ర లేవగానే ... ఇదిగో తల్లీ... నీ కొడుకు అని పిల్లాడిని చేతికందిస్తారు... ఊళఊళ... అయీ... అంటూ పాలిస్తూ పాటలు పాడటం... ఆ పాటలు వినలేక... పిల్లవాడు గుక్కలు పట్టి ఏడవటం... ఓ.కే..."

పార్వతి గుండెలో కొండంత ధైర్యం వచ్చింది. "అయితే పిల్లవాడిని మీరే ముందు చూస్తారు" అంది గోపాలం వంక చూస్తూ.

"మళ్ళీ అమ్మ వస్తుందిగానీ.. నువ్వు చెప్పదలచుకున్న కబుర్లన్నీ గబగబా చెప్పెయ్..."

గోపాలానికి సమాధానం కంటే తల్లి రావమ్మ ముందు వచ్చింది.

"అమ్మా... రెండు చీరెలు... దుప్పటి... తెచ్చాను" అన్నాడు గోపాలం రావమ్మ వంక చూస్తూ మంచం మీదనుంచి గబుక్కున లేచి నిలబడి. రావమ్మ కంటిలో తడి పార్వతికి కనిపించింది.

ఆపరేషన్ సిద్ధం అయేటప్పటికి రాత్రి పదయింది. పార్వతి థియేటరులో పైన లైట్లవంక చూసింది. దేదీవ్యమానంగా ఉన్నాయి. సావిత్రి అక్కడే తిరుగుతోంది. పార్వతికి సంధ్యాసమయంలా ఉంది. కొద్దిసేపట్లో నిద్రపోతుంది. మళ్ళీ మెలకువ వస్తుందో రాదో! నిద్ర లేపమని ఎవరితో చెప్పాలి. అమ్మ ఉంటే చెప్పేది.

నిద్రలో చక్కటి కలలు వస్తాయా? తను అనుకున్నవే కలలోకి వస్తాయి. చక్కటి సంగతులు అనుకోవాలి. తనమీద ఆధారపడి దొర్లుతూ, జుట్టు పీకుతూ తిరిగే పసిపాపను ఊహించుకుంటుంది. ఆ పాప తనను నిద్రలేపుతుంది. "అమ్మా... వచ్చాను... లే అమ్మా... అంటుంది... ఆడపిల్లా... కాదు... మగపిల్లవాడే... సందిట తాయెత్తు... తను స్వయంగా వెన్న తీసి ముద్దచేసి చేతిలో పెడుతుంది... పూదండ కడుతుంది. చెంగల్వపూలు ఎక్కడ దొరుకుతాయి. అవి ఎట్లా ఉంటాయి.

పార్వతి ఊహలోకి మాచమ్మ వచ్చింది. దూరపు బంధువు. భర్తకు సుస్తీచేస్తే ఆసుపత్రి పనిమీద వచ్చింది అప్పుడు. చంటిపిల్లవాడు చేతిలో నిలిచేవాడు కాదు. ఎన్నిసార్లు ఎత్తుకున్నా జారి కిందకు వచ్చి అన్ని సీసాలు పడేసేవాడు. డబ్బాలు బోర్లించేవాడు. వారిస్తే గుక్కపట్టి కచ్చుగా ఏడ్చేవాడు. ఆ ఏడుపు వింటుంటే ఒళ్ళు మండిపోయేది పార్వతికి.

"నీ పిల్లాడు ఏడిస్తే నాకునిద్ర పట్టదుగాని... మీరు వరండాలో పడుకోండి..." అని నిష్కర్షగా చెప్పింది మాచమ్మతోటి. మాచమ్మ చిన్నపుచ్చుకోలేదు.

"అమ్మాయి... నువ్వెక్కడ పడుకోమంటే అక్కడ పడుకుంటాను... నువ్వు నిద్రెందుకు పాడుచేసుకుంటావులే... నాకయితే తప్పదు" అంది మాచమ్మ. వరండాలో దోమలు కుట్టినాయి. మాచమ్మ నిద్రపోలేదు. పిల్లాడు తెల్లవార్లూ వరండా అంతా తిరిగితిరిగి తెల్లవారు జామున నిద్రపోయాడు. పార్వతి ఇంట్లో పడుకుంది గాని తెల్లవార్లూ ఆ పిల్లవాడు ఏ వేళప్పుడు ఇంట్లోకి వచ్చి సామాన్లు పడేస్తాడో అన్న యావతోటే గడిపి నిద్రపోకుండా మేలుకుంది. తెల్లవారకట్ల తలుపుతీసి వరండాలో లైటు వేసి చూసింది. పిల్లాడు వరండాలో మూలగా చలికి ముడుచుకుని కుక్కపిల్లలాగా పడుకున్నాడు. రెండు దుప్పట్లు గూడా తెచ్చుకోలేని దరిద్రులను ఇంట్లోకి రానీయకూడదు. బంధువైతే మటుకు అనుకుంటూ విసుక్కుని వెళ్ళిపోయింది. ఆ పిల్లవాడు చలికి వణకటం గుర్తుకువచ్చింది. తనకు గూడా లోపలినుంచి చలి వణుకు వచ్చినట్లయింది. తన బాబుకు గూడా చలివేస్తోందా? పార్వతి గొంతుకు ఏదో అడ్డుపడినట్లయింది. మాచమ్మా కొడుకూ ఎక్కడ ఉన్నారో? ఇప్పుడు వస్తేనా! తన గదిలో మంచం వేయించి రెండు దుప్పట్లు ఇస్తుంది - దోమతెర కడుతుంది. కానీ వాళ్ళెక్కడున్నారు? దరిద్రులకి చిరునామాలుంటాయా? పార్వతి వాళ్ళని మరచిపోవడానికి ప్రయత్నిస్తోంది.

వీడెవరు.... బుచ్చిబాబు... వాడి ముఖం చూడాలి!! ముద్దులాగా ఉంటాడు. పనిమనిషి కొడుకు సత్తిగాడో, నరిసిగాడో పెట్టుకుంటే పోలా? వాడికి 'పట్టాభిరాం' పైగా 'బుచ్చిబాబు' అని ముద్దుపేరు. వాడికి పార్వతిని చూస్తే ప్రాణభయం. తల్లి చూడకుండా వాడిని గిల్లేది. చెవులు మెలేసేది. వాడు ఏమనేవాడు కాదు. ఆ శరీరం తనది కాదన్నట్లు మెదలకుండా

ఉండేవాడు. తల్లిని చూడగానే బావురుమనేవాడు. గుక్కపెట్టి ఏడ్చేవాడు. పార్వతిని చూపించి "అమ్మ... అమ్మ" అనేవాడు. ఏడుస్తూనే. "అమ్మగారికి దణ్ణం పెట్టు..." అనేది సత్తెమ్మ. "వీడు చదువుకుని పెద్ద కలెక్టరు అవుతాట్ట అమ్మగారూ... ఎరకలసాని సోది చెప్పింది. ఈడి అయ్యగూడా... పెద్ద ఉద్యోగం చేస్తున్నాట్ట...!" సత్తెమ్మ పళ్ళన్నీ బయటపెట్టి చెపుతూంటే పార్వతికి వళ్ళు భగ్గున మండిపోతున్నట్టుండేది.

"వీడి బాబెవరో... వీడికి తెలియదు సరా... నీకు తెలుసన్నమాట!" పార్వతి వెటకారంగా అంది. "అదేంటమ్మగారూ! అది తెలియకేం... ఇప్పుడెక్కడుంటున్నాడో కానీ..."

"నీతో చెప్పి పోలేదా..."

"చెప్పి వచ్చాడా... ఎదవ సచ్చినోడు... చెప్పిపోవడానికి... అయినా పెద్ద నౌకరీనే అయిందట... నాకు తెల్సిందిగా... ఇక్కడ లారీలు కడిగేవాడుగా. ఇప్పుడు పెద్ద కారునడుపుతున్నాట్ట!" పనిమనిషి కారులో కూర్చున్నంత సంబరపడింది.

"మంచిది... మంచిది... వీడిని తీసుకెళ్ళి... అంట్లు తోముకునేటప్పుడు నీ పక్కనే కూర్చోపెట్టుకో..."

"ఈడు ఇప్పుడు ఎక్కడ కూర్చుంటేనేం అమ్మగారూ పెద్దయినాక కుర్చీలో కూర్చుంటాఁడు..."

సత్తెమ్మ బుచ్చిబాబును సందులో బాదం చెట్టుకింద కూర్చోబెట్టి అంట్ల దగ్గరకు పోయింది. పార్వతి చెట్టు దగ్గరకు వెళ్ళినట్టు వెళ్ళి ఒక పుల్లతో వాడి కాలిమీద పొడిచింది. వాడు ఏడవలేదు. భయంగా చూస్తున్నాడు. కళ్ళ వెంబడి నీళ్ళు వచ్చి దొర్లిపోవడానికి భయపడ్డట్లు కంటిరెప్పల మీద నిలబడ్డాయి.

సత్తెమ్మ పిల్లవాడిని తీసుకుని వెళ్ళటానికి రాగానే గొల్లుమనిఏడ్చాడు. పార్వతి ముందు భయపడింది ఏం చెబుతాడోనని.

. "ఇక్కడ కూర్చోపెట్టావేమిటే.. అన్నీ గండుచీమలున్నట్లున్నాయి!" పార్వతి గబగబా ఏడచివెళ్ళిపోయింది గాని ఆ పిల్లవాడు "అమ్మ... అమ్మ" అంటం వినిపిస్తోంది. తన గురించి చెబుతున్నాడా? పేదవాళ్ళకు నోరు వరమా? శాపమా? అశక్తుడైన ఆ చంటిపిల్లవాడిని తను ఎందుకు ఏడిపించింది?

ఆ రోజుల్లో పార్వతి ఎందుకలా ప్రవర్తించిందో జ్ఞాపకం రావటం లేదు. తనలో హింసా ప్రవృత్తి అంతర్గతంగా ఉండేదా? ఆ పిల్లవాడు ఇప్పుడు కనిపిస్తే... ఎక్కడున్నాడో! ఏమో!! వీళ్ళంతా ఈ సమయంలో గుర్తుకు వస్తున్నారేమిటి? ఛీ... పార్వతికి ఆందోళనగా ఉంది. ఆ పిల్లవాడు కనిపిస్తే ఎత్తుకుని ఆడిస్తుంది. బిస్కెట్లు పెడుతుంది. బూస్ట్, బోర్నవిటా, ఓవల్టీను, వివా... వాడికి ఏది ఇష్టం? ఇన్ని రకాలుంటాయని వాడికి తెలుసా? మనసు వికలమవుతోంది. " ఇప్పుడు నేను పురుడు పోసుకోను ఈసారెప్పుడన్నా వస్తాను" అని చెపుదామనుకుంది. పైన దీపాలు చిన్న పాపల్లా మెరుస్తున్నాయి. "దరిద్రులకి పిల్లల్ని కనే హక్కు ఎవరిచ్చారు? "నోట్లోంచి మాటలు బయటకు రావటం లేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి... కాళ్ళా... గజ్జె... కాళ్ళా...

పార్వతికి మెలకువ వచ్చేటప్పటికి చుట్టూరా వాతావరణం అంతా మార్పుగా ఉంది. మందుల వాసన. పసిపిల్లల వాసన. కంటికెదురుగా మనుష్యులు నీడల్లాగా కన్పిస్తున్నారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. గోపాలాన్ని గుర్తుపట్టింది. ఏదో చెప్పాలనుకుంది. అన్నిటికన్నా ముఖ్యమయిన సంగతి... తనకి మెలకువ వచ్చింది. మళ్ళీ ఈ లోకం చూస్తాననుకోలేదు.

అనంతమైన సృష్టిలో తానూ ఒక భాగమైనప్పటికీ తాను ఈ రంగుల ప్రపంచాన్ని

దర్శించగలదో, మౌనంగా అచేతనంగా ఒక భాగమై లీనమైపోతుందో అన్న సంశయంలో పడ్డ పార్వతి చూపు గోపాలం వైపు పడింది. తను మళ్ళీ చూడలేనేమో అనుకున్న వ్యక్తి కనిపించాడు. తనకు ఇంకేం అక్కరలేదు. కానీ ఏదో లోపంగా ఉంది. అంతులేని నిశ్శబ్దం... ఈ నిశ్శబ్దాన్ని తాను భరించలేదు... గోపాలం దగ్గరగా వచ్చి నిలబడ్డాడు. డాక్టరు సావిత్రి వచ్చింది. "కంగ్రాచ్యులేషన్స్" అంది. పార్వతి ఆశగా చూసింది. ఏదో వెలితి. ఏడుపు వినిపించటం లేదు.

"ఎక్కడ?" అంది పార్వతి ఆందోళనగా.

"స్పెషల్ వార్డులో..."

పేదవాళ్ళకు జనరల్ వార్డు. గొప్పవాళ్ళకు స్పెషల్ వార్డు అవునా? కాదు... భయం వేసింది.

"అక్కడ ఎవరున్నారు?"

"అక్కడకు ఎవరూ పోగూడదు"

"ఏడుపు వినబడటం లేదేం..."

"ఏడవటం లేదు!..."

"ఎందుకని?..." ఆ తర్వాత పార్వతి అడగలేకపోయింది.

"డాక్టర్... డాక్టర్" అంటూ గొణిగింది. సావిత్రి ముందుకు వచ్చి మంచంమీద కూర్చుంది.

"భయం లేదు."

పార్వతికి గుండె గుబగుబ కొంచెం సర్దుకుంటోంది. బాబు ఎందుకు ఏడవటం లేదు? తనను చూసి భయపడ్డాడా! ఏడవకుండా భయపెట్టిందా తను.

"ఒక్కసారి చూడవచ్చునా..."

"ఊహుం..."

"ఒక్కసారి... ప్లీజ్... ప్లీజ్"

సావిత్రి మెల్లిగా లేచి వెళ్ళి నర్సుతో ఏమిటో చెప్పింది. నర్సు పక్కన స్పెషల్ రూంలోకి వెళ్ళి వచ్చింది. బాబు ఏడుపు వినబడటం లేదు. పార్వతి భయంభయంగా చూసింది. అతని కళ్ళల్లోకి చూడాలనుకుంది. కాని బాబు రాలేదు. వాడితో మాట్లాడటం ఎట్లాగు? ఏడవటం లేదు? ప్లీజ్ ఒక్కసారి ఏడవరా? పార్వతికి ఏడుపు వస్తోంది. వాడిని గిల్లితే! కొడితే! పుల్లపెట్టి గుచ్చితే... మొట్టికాయలు వేస్తే ఏడుస్తాడు. నర్సు వస్తుంటే పార్వతి చేతులు చాపింది. పేదవాళ్ళ పిల్లలే ఏడవటానికి అర్హులు అని తను ఎందుకు అనుకుంది? ఆమె ముఖకవళికలు వెంట వెంటనే మారుతున్నాయి. పార్వతి చేయి వణుకుతున్నది. ఇంతలో పసిపిల్లలు క్యారు క్యారుమంటూ గొల్లున గోలచేయడం వినిపించింది. పసిపిల్లలు నలుగుర్ని స్నానం చేయించటానికి తీసుకుపోతున్నారు నర్సులు.

"వాళ్ళెవరు?" పార్వతి ఆశగా అడిగింది. నర్సు సమాధానం చెప్పలేదు. పార్వతి కళ్ళు చికిలించి శ్రద్ధగా చూసింది. వాళ్ళని ఎలా పోల్చుకోవటం... వాళ్ళలో దరిద్రులు ఎవరు? సంపన్నులు ఎవరు? డాక్టరు సావిత్రిని దగ్గరకు పిలిచి చేతులు పట్టుకుని "సావిత్రీ మా ఆస్తి... అంతస్తులు అన్నీ ఎవరికన్నా ఇచ్చేస్తాను. బాబుకు స్పెషల్ రూం వద్దు... వాడిని ఇక్కడకు తీసుకురండి... వాడిని ఏడిపించండి... కొట్టండి... తిట్టండి... ఏమయినా చేయండి... వాడిని ఏడిపించండి... ప్లీజ్!" అంటూ డాక్టర్ సావిత్రి చేతులు పట్టుకుని వలవలా పసిబిడ్డలా ఏడ్చింది పార్వతి.

**(తెలుగు డైజెస్టు - జూన్,1979 (ప్రారంభసంచిక))**